# బహుమతి

"చిరంజీవి భాస్కరానికి,

ఆశీర్వదించి వ్రాయునది—నేను మా పిన్నత్తగారి కూతురు పెళ్ళికి ఇక్కడకు రావటం తటస్థించింది. ఇటు నుంచి నీ దగ్గరకు వచ్చి కొన్ని రోజులు వుండి వెళ్ళాలని అనుకుని మీ బావగార్కి ఉత్తరం రాయడం, ఆయన అనుమతించటం రెండూ జరిగిపోయినాయి. నేను 9 వ తారీఖు రాత్రి బెజవాడ వచ్చి అక్కడనుంచి ఆ రాత్రి ట్రెయిన్‌లో నీ దగ్గరకు రాగలను. వచ్చేముందు మళ్ళీ మా చిన్న మరిది చేత టెలిగ్రాం యిప్పిస్తాను. నువ్వు అశ్రద్ధ చెయ్యక తప్పకుండా స్టేషన్‌కు రాగలవు.

ఇట్లు
ఆశీర్వచనములతో
అక్క
విశాల.

పి. యస్: నేను వస్తూ, పండుగకి శుభాకాంక్షలతో పాటు నీకో మంచి బహుమతి తీసుకొస్తున్నాను. అదేమిటో నువ్వు కల్లోకూడా వూహించ లేవని గట్టిగా చెప్తున్నాను."

పదవతారీఖు ఉదయం ఎనిమిది గంటలకు నాంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫారంమీద బెజవాడనుంచి రాబోతున్న రైలుకోసం యెదురుచూస్తూ పాంటుజేబుల్లో చేతులుపెట్టుకుని అటు యిటు పచార్లు చేస్తున్న భాస్కరం వొక్క నిమిషం ఆగి జేబులోంచి వుత్తరం తీసుకొని మరోసారి చదువుకున్నాడు. "కల్లోకూడా వూహించలేని బహుమతట! ఏమిటో

అదిః" కవరుతో పాటు బయటికొచ్చిన టెలిగ్రాం త్రిప్పి చూస్తూ అనుకున్నాడు. బహుమతి అనేసరికి అదేమిటో ఊహించాలని సహజంగా ప్రతివాళ్ళకి అన్పిస్తుంది. వద్దన్నా భాస్కరం రకరకాలుగా వూహించసాగాడు.

"అశ్రద్ధ చెయ్యక స్టేషనుకు రాగలవు" ఉత్తరంలో కళ్ళు నిల్చిన చోట కన్పించిన వాక్యాన్ని చూసి నవ్వుకున్నాడు. అశ్రద్ధట! రాక రాక కొన్ని సంవత్సరాలకి తనంతట తాను కొద్దిరోజులుండి వెడతానని వస్తోంది విశాల. అందులో తనకి ప్రత్యేకంగా వూహించలేని బహుమతి తీసుకొస్తున్నానని వూరిస్తోంది. అలాటప్పుడు స్టేషన్‌కి రాకుండా యెవరు మాత్రం వుండగలరు! తన రక్తం పంచుకుని పుట్టకపోయినా, యిద్దరూ ఒక తల్లి బిడ్డలు కాకపోయినా, విశాల, భాస్కరంల మధ్య సోదర సోదరీ సంబంధమైన తియ్యటి బంధం ఒకటి పటిష్ఠంగా ఉంది.

చిన్నప్పుడు చాలామటుకు విశాల, భాస్కరం వాళ్ళ యింట్లోనే పెరిగింది. భాస్కరం తల్లి ఆమె పెళ్ళికూడా తన యింట్లోనే తన చేతుల మీదనే జరిపించి, ఆడపిల్లలు లేనికొరత తీర్చుకుంది. అప్పుడుగాదు యిప్పటికీ కూడా విశాల భాస్కరం నుంచి యీ పని కావాలనిగానీ, ఇంట్లోంచి యీ వస్తువు పట్టుకుపోతున్నాను అనిగాని అంటే అతను కాదనలేడు.

ఈ మధ్య మరీ పిల్లలతల్లి అయిన విశాల సంసారం గొడవలో పడిపోయి రాకలు తగ్గించేసింది. అప్పుడప్పుడు భాస్కరం తనే మద్రాసు వెళ్ళి ఓ వారంరోజులు గడిపి వస్తూంటాడు. విశాల రావటమే గాక కొద్దిరోజులుంటానని కూడా రాయటంతో అతని మొహం మరీ వికసించింది. ఈ నాలుగురోజులు ఆఫీసు కాగితాల గొడవ ప్రక్కన పెట్టి చాలా సరదాగా గడపాలనుకున్నాడు. తల్లిపోవటంతో తనది ఒంటరి బ్రతుకయిపోయింది. ఆవిడ తర్వాత ఆ ఖాళీని పూరిచేసి తన జీవితం ఆక్రమించుకోగల వ్యక్తి ఇంకా భాస్కరానికి దొరకలేదు.

పరధ్యానగా ఆలోచిస్తున్న భాస్కరానికి దూరంగా సిగ్నల్ చెక్క వంగటం గానీ, రైలు ప్లాట్‌ఫారం మీదకు చేరుకోవటంగానీ తెలియదు. ఈలోకంలో పడి అతను అది గమనించే లోపలే పెద్దగా

శబ్దం చేసుకుంటూ గోంౖడిస్తూ వచ్చిన రైలు ప్లాట్‌ఫారంమీద ఆగిపోవటం జరిగింది. అంతవరకూ బద్ధకంగా, నిశ్శబ్ధంగా ఉన్న స్టేషన్ ఒక్కసారి నిద్రలేచినట్టు అంతా సందడిగా హడావుడిగా అయిపోయింది. భాస్కరం గబగబా ఫస్టుక్లాసు కంపార్టుమెంటువైపు పరుగెత్తాడు. అప్పటికే రేగిపోయిన జుట్టుతో బద్ధకంగా వున్న కళ్ళతో విశాల తలుపు దగ్గరకు వచ్చి నిలబడి భాస్కరాన్ని చూసి చేయి వూపింది.

"హమ్మయ్య వచ్చావుగదా! వస్తావో రావో అనుకుంటున్నాను" అంది పాపని భాస్కరానికి అందిస్తూ.

"రాకుండా యెలా ఉంటాను? అందులో నువ్వు నాకోసం ప్రత్యేకంగా...."

విశాల చేతుల్లోంచి పాపని అందుకుని పాప బుగ్గలు కొరుకుతున్న భాస్కరం మధ్యలో హఠాత్తుగా ఆగిపోయాడు. విశాల వెనుక సన్నగా పొడుగ్గా దంతపు బొమ్మలా నిగనిగలాడుతున్న ఓ అమ్మాయి-మరచెంబు, ఫ్లాస్క్ తీసుకుని కూలీకి అందిస్తోంది. వెడల్పాటి కళ్ళు, చెక్కినట్లున్న ఆ ముక్కు చూసే వాళ్ళని పదే పదే తమవైపు ఆకర్షిస్తున్నాయి.

"ఎవరు?" ముగ్గురూ ప్లాట్ ఫారమ్మీద నడిచి వస్తుండగా విశాలకి కుడిప్రక్కన నడుస్తున్న భాస్కరం అడిగినమాట విశాలకే తప్ప యెటో చూస్తున్న ఆ అమ్మాయికి విన్పించలేదు.

"గుర్తుపట్టలేదా?" తలతిప్పి భాస్కరంవైపు చూసి అంది విశాల.

"నేనా? ఓసారి చూసిన మనిషేనా ఏమిటి?" ఆశ్చర్యపోతూ అన్నాడు భాస్కరం. అంత చక్కటి కళ్ళు ఒకసారి చూసింతర్వాత జన్మలో యెవరయినా మరిచిపోగలరా? అందులో తాను! భాస్కరానికి మతిపోయింది. "యెక్కడో చూసినట్లే వుంది. కాని....కాని గుర్తురావటం లేదు." విశాల వెంటనే నవ్వేసి ఫలానా అని చెబుతుందేమోనని అబద్ధం ఆడేశాడు. కాని విశాల చెప్పలేదు. పైగా మొహం సీరియస్‌గా పెట్టుకుంది.

అందరూ స్టేషన్ దాటి బయటకొచ్చేశారు. ఇంటి కొస్తుండగా దోవలోనే "బహుమతి ఏమిటో తెస్తానన్నావు?" అన్నాడు; అతిథిని తీసుకొస్తానని రాయటానికి పొరబడి అలా రాసిందేమో అనుమానంతో.

"తొందర పడకు. ఇవ్వటానికి తీసుకొచ్చినదాన్ని తిప్పి తీసుకు

పోనులే." కారులోంచి బయటకు చూస్తున్న విశాల గంభీరంగా అంది. భాస్కరం నవ్వి వూరుకున్నాడు.

ఇంటికి వచ్చేసింతర్వాత కాఫీలవీ అయిపోగానే పాపకి స్నానం చేయించి గౌను వేసోంది విశాల.

"చెప్పు. మీ అత్తగారి వైపు బంధువనుకుంటాను. లేకపోతే మద్రాసు నుంచి తీసుకొచ్చిన స్నేహితురాలా?" భాస్కరం తన వూహల్ని ఏకరువు పెట్టసాగాడు. ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవాలని అతనికెంత ఆత్రంగా వుందో అంత నిబ్బరంగా కూర్చుని పాపకి తల దువ్వసాగింది

"పోనీ, కనీసం పేరయినా చెప్పు-గుర్తొస్తోందేమో చూస్తాను" ఆశగా అన్నాడు భాస్కరం.

"ఎవరూ? అత్త పేరేనా? నాకు తెలుసు. చాక్లెట్ యిస్తే చెప్తాను." తల దువ్వించుకుంటున్న పాప తల్లి చేతుల్ని తోసేసి వెనక్కు తిరుగుతూ అంది.

"చెప్పు, రెండిస్తాను."

"భారతి. రెండుగాదు, నాలుగు కావాలి. జింకపిల్ల బొమ్మగూడా" సమాధానం చెప్పేసిన పాప బుద్ధిమంతురాలిలా మళ్ళీ పాపిడి తీయించుకోటానికి తల్లివైపు తిరుగుతూ అంది.

"భారతి అత్తా?" క్షణంసేపు అర్థంగానట్లు చూసిన భాస్కరం మొహంలో గబగబ రంగులు మారాయి.

విశాల తలెత్తకుండా పాపకి తలదువ్వుతూ "చూడగానే గుర్తుపడతావనుకున్నాను. నువ్వింత మర్చిపోతావనుకోలేదు" అంది. చూస్తుండగానే భాస్కరం మొహం సీరియస్‌గా మారిపోయింది. కూర్చున్నవాడల్లా చటుక్కున లేస్తూ, "నాకిప్పుడు అర్థమైందిలే. నువ్వు తెస్తానన్న బహుమతి ఇదే గదా?" అన్నాడు.

"ఛ, తమాషాకి రాశాను. నా మొహం, నీ వస్తువు నీకు బహుమతి ఇవ్వటం ఏమిటి? అదేంగాదు. కూర్చో."

అనుకోకుండా మారిపోయిన భాస్కరాన్నిచూస్తూ అయోమయంగా అంది విశాల.

భాస్కరం కూర్చోలేదు. "ఇప్పుడే వస్తాను" అంటూ గబగబా వెళ్ళిపోయాడు

"ఇదుగో—నా మాట విను. ఏదయినా అసభ్యంగా ప్రవర్తించావంటే నేనిప్పుడే వెళ్ళిపోతాను. నీ యిష్టం" అంది వెనుకనుంచి గట్టిగా పిలుస్తూ.

గుమ్మంవరకు వచ్చిన భాస్కరం ఆగిపోయి వెనక్కు తిరిగి చూశాడు.

"నిజం, పాపమీద ఒట్టు!" పాప తలమీద చేయి పెడుతూ దృఢంగా అంది విశాల.

క్షణంసేపు భాస్కరం కళ్ళు చిత్రంగా కదిలాయి. వెంటనే తలూపుతూ "ఇప్పుడే వస్తాను" అని వెళ్ళిపోయాడు జన్మలో ఏనాడూ ఇవాళ వచ్చినంత కోపం అతనికి రాలేదు.

గదిదాటి బయటి కొచ్చేస్తున్న భాస్కరానికి దూరంనుంచి తెల్లటి చీరని సున్నితంగా తన్నుకుంటూ వస్తున్న రెండు పాదాలు కన్పించాయి. వాటిని చూస్తూనే అవి ఎవరివో గ్రహించిన భాస్కరం తలెత్తకుండానే మరింత వేగంగా గబగబా ప్రక్కనుంచి దూసుకుపోయాడు. దూసుకుపోయినవాడు అలా అలా వెళ్ళిపోలేదు. కొంచెం ముందుకు వెళ్ళి అప్రయత్నంగా భుజంమీదనుంచి వెనక్కితిరిగి చూశాడు. చేతిలో సబ్బుపెట్టెతో, భుజంమీద తడి తువాలుతో తన ప్రక్కనుంచి గబగబా వెళ్ళిపోయిన భాస్కరంవేపు తల తిప్పిచూస్తూ సంభ్రమాశ్చర్యాలతో అలాగే నిలబడిపోయింది భారతి.

ఇద్దరి చూపులు కలుసుకున్నాయి! భాస్కరం కనుబొమలు ముడిపడ్డాయి. భారతి మొహం ఎర్రబడింది. ఇద్దరూ ఒకేసారి గిరుక్కున వెనక్కు తిరిగి ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పడుకోబోతుండగా విశాల పైకివచ్చి భాస్కరం గదిలో కూర్చుంది. ఉదయం భారతి పేరువినగానే బయటకు పారిపోయిన భాస్కరం రెండు గంటల తర్వాత తిరిగి వచ్చాడు. కానివెళ్ళిన భాస్కరం వేరు,

తిరిగి వచ్చిన భాస్కరం వేరు. ఉదయం స్టేషన్‌లో నీట్‌గా తెల్లని బట్టలు నవ్వుతూ అప్యాయంగా వచ్చిన భాస్కరం వేరు. ఇప్పుడు నలిగిన బట్టలతో గంటు పెట్టుకుని, విశాల కనిపిస్తేనే ప్రక్కచూపులు చూస్తున్న భాస్కరం వేరు. అది గమనించే కావాలని పైకివచ్చి అతని ఎదురుగుండా కుర్చీ లాక్కుని కూర్చుంది.

మంచంమీద పడుకుని పుస్తకం తిరగేస్తున్న భాస్కరం విశాలని చూసీ చూడనట్టు ఊరుకున్నాడు. పాప నిద్రపోయింది. ఇంట్లో మరో వ్యక్తి మేలుకుని ఉంటే ఉండవచ్చుగాక, కాని క్రిందఉన్న ఆమెకి వీళ్ళ సంభాషణ నామ మాత్రంగూడా విన్పించదు. విశాల తనే మొదలు పెట్టింది. "నేను చేసిన ఈ పని నీకేమాత్రం నచ్చలేదని నాకు తెలుసూనే వుంది. కాని నువ్వు మనిషిని ఇంత మొహం కూడా గుర్తుపట్టలేనంతగా మర్చిపోతావని నేను అనుకోలేదు." విశాల గొంతులో బాధ, క్షమాభావం రెండూ విన్పిస్తున్నాయి.

"మనిషిని మర్చిపోవటంలో నా తప్పేంలేదు. ఆరు సంవత్సరాల క్రితం ఐదు నిమిషాలు కూడా సరిగ్గా చూడని మనిషిని అంత యిదిగా జ్ఞాపకం పెట్టుకునే ఆసక్తివుంటే ఇన్ని సంవత్సరాలు యిలా గడిచేవి కావేమో! నువ్వు ముందు ఉత్తరం వ్రాయాల్సింది." కటువుగా అన్నాడు భాస్కరం. "ఉత్తరం రాయాలనే అనుకున్నాను. కాని ముందుగా తెలియబరిస్తే కనీసం ఈ మొహం చూసే అవకాశం కూడా యివ్వవేమోననే భయంతో...." అర్ధోక్తిలో ఆగిపోయింది విశాల.

"మనిషిని చూస్తే మనసు మారుతుందని నువ్వనుకున్నట్లయితే పొరపడ్డావనే చెప్పాలి. ఉదయం ఎవరు, ఎవరు అని నేను ఆసక్తిగా అడిగినమాట నిజమే. కాని... కాని...." భాస్కరం కూడా సగంలో ఆగిపొయ్యాడు. ఇద్దరి మధ్య నిశ్శబ్దం యేర్పడింది. కొద్దిసేపయింతర్వాత భాస్కరం తనే అన్నాడు. "చాలా పొరపాటు చేశావు విశాలా! ఇదే రెండు సంవత్సరాలక్రితం అయితే ఎలా వుండేదో! కాని, ఇప్పుడెలా? మరో అమ్మాయి నా జీవితంలోకి వచ్చింది. ఆ అమ్మాయిని కొద్ది రోజుల్లో పెళ్ళి చేసుకోబోతున్నాను."

విశాల ఉలిక్కిపడి తలెత్తి చూసింది. విశాల చూపుల్ని తప్పించు

కుంటూ భాస్కరం బొంగురుగా "నువ్వొస్తున్నావంటే యెంతో సంతోష
వడ్డాను. రేణుని నీకు పరిచయం చెయ్యాలనుకున్నాను- అంతా పాడు
చేశావు. సమస్యలులేని నాకు సమస్య తెచ్చి పెట్టావు." నిష్ఠూరంగా
అన్నాడు.

"నేను చేసింది పొరపాటే కావచ్చు" అంటూ తనే పరిస్థితులలో
తప్పనిసరిగా ఈ పొరపాటు చేయాల్సి వచ్చిందో వివరంగా చెప్పసాగింది.

## 2

విశాల పిన్నిగారి కూతురు పెళ్ళికోసం బందరు వచ్చినప్పుడు
అక్కడికి వచ్చిన చుట్టాలలో భారతి, ఆమె మేనత్త గూడా ఉన్నారు.
పెళ్ళి హడావుడిలో ఉన్న విశాల భారతిని మొదట్లో అంతగా గమనించ
లేదు. కాని భారతి మేనత్త విశాలని చూడగానే గుర్తుపట్టింది. అసలు
విశాల వస్తోందని తెలిసే మేనకోడల్ని వెంట పెట్టుకుని ఆవిడ వచ్చింది.
విశాలను చూడగానే అంతెత్తున లేస్తూ "యేమ్మా! ఆ రోజున ఆడబడు
చుని అనిచెప్పి బొట్టు పెట్టుకుని పట్టుచీరె తీసుకున్న మహాతల్లివి కాదూ
నువ్వు? ఆడబడుచుగా ఆ అధికారం ఇప్పుడేమైంది? అంత అక్కరలేని
వాడు ఆనాడే చెప్పాలిగాని మెళ్ళో మూడు ముళ్ళు వేసి ఇప్పుడు ఆ పిల్ల
నాకక్కర్లేదంటే ఏమిటిమీ ఉద్దేశ్యం? ఇదంతా నాఖర్మ! నాకేతిండి ఎట్లా
గడుస్తుందా అని నే నేడుస్తుంటే, నా మెడకు యిదో గుదిబండ" అంటూ
బిగ్గరగా మాట్లాడుతూ ముక్కుచీది శోకాలుతీసి విశాలని, తల్లిని దుమ్మెత్తి
పొయ్యసాగింది. దూరంగా అక్కడక్కడా పెళ్ళి పందిట్లో కూర్చుని
ఏదో మాట్లాడుకుంటున్న వారంతా వింత చూడటానికి దగ్గరగావచ్చి
గుంపుగా మూగారు. వచ్చిన వాళ్ళందరికి భారతి మేనత్త చిలవలు
పలువలు కల్పించి చెప్పసాగింది.

అంతా విన్న భారతి పిన్నత్తగారు "అదేమిటే విశాలా! మీవాడికి
అసలు కళ్ళున్నాయా అని! లక్ష్మిలాంటి పిల్లని వదిలెయ్యటాని
కేమొచ్చిందీ?" అంది.

ఆడబడుచులు "ఈ తమ్ముణ్ణి గురించేనా మాతో మాభాస్కరం
మా భాస్కరం' అంటూ గొప్పలు చెప్పుకున్నావు వదినా!" అంటూ వేళా

కోళం పట్టించారు. సిగ్గుతో అభిమానంతో విశాల ప్రాణం చచ్చిపోయింది. అనుకోకుండా వచ్చి తనని చుట్టేసిన యీ గాలిదుమారానికి ఏం జవాబివ్వాలో, యెలా నిలబడాలో అర్థంగాలేదు. ఎర్రబడ్డ మొహంతో నిలబడిపోయినా విశాలవైపుకి తన ప్రక్కనే కొయ్యలా బిగుసుకుపోయి నిలబడిన భారతిని తోసి "ఇదుగో! నీ యిష్టం! మీ తమ్ముడి దగ్గరకు తీసుకెడతావో లేక ఇంత విషం కలిపే యిస్తావో - నీ యిష్టం" అంటూ తోసింది. అసలే అదోలా ఉన్న భారతి తూలి విశాలమీద పడబోయింది. తనమీద పడబోతున్న భారతిని అప్రయత్నంగా విశాల చేతులు అడ్డుపెట్టి ఆపింది. క్షణంసేపు ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. ఎర్రబడిపోయిన భారతి మొహంలో-కళ్ళలో నీరు సుళ్ళు తిరుగుతున్నాయి. హఠాత్తుగా విశాల అంతకుముందు తనుపడిన మాటలు, పొందిన అవమానం మర్చిపోయి, దాని స్థానంలోనే భారతి అంటే ఓ విధమయిన జాలి, సానుభూతి ఏర్పడినాయి. తెల్లగా, పొడుగ్గా, సన్నగా ఉన్న ఈ అమ్మాయికి నా అనే దిక్కులేదు. తన కాళ్ళమీద తను నిలబడగలిగే సమర్థత ఇచ్చే చదువు ఉందా అంటే అదీలేదు. ఇష్టం ఉన్నా-లేకపోయినా బాధ అనిపించినా, అవమానం అని తోచినా తిట్లు, శాపనార్థాలు తింటూ మేనత్త కొడుకులింట్లో వుండాల్సిందే! హఠాత్తుగా విశాలకి ఎలాగయినాసరే, భారతిని తీసుకెళ్ళి భాస్కరానికి అప్పగించాలనిపించింది. అదే నిశ్చయాన్ని భారతి మేనత్తకి వాగ్దానంగా ఇచ్చింది. ఆ వాగ్దానం తీర్చుకోవటానికే మద్రాసులో భర్త భోజన సౌకర్యంలేదు, వెంటనే బయలుదేరి రమ్మనమని రాసినా కాదని హైద్రాబాదు ప్రయాణం వేసుకొని భాస్కర్ధం దగ్గరకు వచ్చింది,

భారతిని తనతో తీసుకురావడం తీసుకొస్తోందిగాని,విశాల లోపల్లోపల భయపడకపోలేదు. భాస్కరం మొండితనం, పిచ్చిపట్టు విశాలకి తెలియనవి కావు ఏ పరిస్థితులలో ఈ పెళ్ళి అయిందో గూడా విశాలకి తెలుసు. భారతిని చేసుకోవటం భాస్కరానికి ఏమాత్రం ఇష్టంలేని మాట నిజమే, కాని అది భారతిమీద అయిష్టంకాదు అతనికి కాబోయే భార్య చదువుకుని తనతోపాటు సమానంగా తిరగ్గలిగిన సంస్కారవంతురాలు కావాలి. కాని భాస్కరం తల్లికి యీ కాలపు చదువులు, కూ

వేషాలు సుతరామూ గిట్టవు. ఆవిడ దృష్టిలో ఆడదంటే అడబే. అన్ని విషయాలకి నిశ్చింతగా మగవాడి మీద ఆధారపడవలసిందే. అలా ఆధారపడ్డవాటిని అర్థంచేసుకుని మగవాడు ఆఅవసరాలు తీర్చవలసిందే. భారతి విషయంలో తల్లీకొడుకుల మధ్య విపరీతమయిన అభిప్రాయ భేదాలు వచ్చాయి. భాస్కరం అప్పట్లో విశాలకి ఉత్తరం రాశాడు కూడా. ఆ ఉత్తరం చూసి పరుగెత్తు కొచ్చిన విశాల "భాస్కరానికి ఇష్టంలేని పెళ్ళి చెయ్యొద్దు" అని పెత్తల్లిని బ్రతిమలాడింది.

విశాల మాటలు వింటూనే ఆవిడ తారస్థాయిని అందుకుంటూ "సలహాలు నాకేమీ అక్కరలేదు. అయితే యీ మాట నాకు చెప్పు. ప్రపంచంలో వాడు సుఖపడాలని నాకంటె యెవరైనా యెక్కువ కోరుతారంటావా? ఏమిటో అర్థం చేసుకోవాలిట యీయన్ని .. అర్థం! మీ పెద్దనాన్నగారి కంటే వీడు కొమ్ములు తిరిగినవాడా? ఆయన్ని నేను అర్థం చేసుకోలా? నాకేం చదువు సంధ్యలున్నాయి? నాకు తెలుసులేవే. ఆ సుధాకరం చెల్లెలు సుమతిని చేసుకోవాలని వీడి ఉద్దేశ్యం. నాకంఠంలో ప్రాణం ఉండగా ఆ పిల్లను ఈ గుమ్మం యెక్కనివ్వను" అంది.

చివరికి యిష్టాలతో ప్రస క్తిలేకుండా భాస్కరం పెళ్ళి స్థిరపడి పోయింది. చూస్తూండటం తప్ప యేం చెయ్యలేని భాస్కరం - సంతోషం అనేది ఎరక్కుండా స్నేహితులు, సరదాలులేకుండా మూడో పెళ్ళివాడికి ముడిపడుతున్న కన్నెపిల్లలా మొహమంతా గంటు పెట్టుకుని ఆ పెళ్ళి తతంగం కాస్తా అయింది అనిపించాడు.

పెళ్ళయి రెండు నెలలుకూడా తిరగలేదు. ఇంట్లో పెళ్ళి తాలూకు సువాసనలు యింకా పోంతం పోనేలేదు. భాస్కరం తల్లి మంచాన పడింది. డాక్టర్లు టైఫాయిడ్ అన్నారు అది విషమిస్తోందని తెలుసుకున్న ఆవిడ కోడలికి కబురు చెయ్యమంది. సరేనన్నాడు భాస్కరం. కాని కోడలు రానేలేదు. వచ్చిందో లేదో, భాస్కరం అసలు కబురు పంపాడో లేదో తెలుసుకునే అవకాశం లేకుండానే ఆవిడ పోయారు. భారతికి కూడా కబురు వెళ్ళలేదు.

దాదాపు నెలరోజులకి యీ కబురు తెలిసిన భారతి మేనమామ పరుగెత్తుకొచ్చాడు. అత్తగారు పోయిన కబురు రాకపోవటం భారతి,

భాస్కరం ప్రక్కన లేకుండా శ్రాద్ధకర్మలు జరిగిపోవటం అందరికీ వింతగా కన్పించి అనేక కథలల్లటానికి కారణం అయింది.

భారతి మేనమామను భాస్కరం తప్పించు తిరగసాగాడు. అది గ్రహించిన ఆయన యెలాగో భాస్కరాన్ని కలిసి భారతి విషయం ఎత్తాడు. ఏడాదిదాకా ఆ మాట ఎత్తవద్దని, యెప్పుడు వెళ్ళేది చెబితే, నౌకరు టికెట్ కొని యిస్తాననీ నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు భాస్కరం.

భారతి మేనమామ చాలా మెతకమనిషి. మనుష్యుల మాటల్ని బట్టి ధోరణి నిర్ణయించలేని అమాయకుడనీ చెప్పవచ్చు. భాస్కరం మాటల వెనకవున్న కటుత్వం ఆయన మనసు పట్టించుకోనేలేదు. తల్లి పోయిన చికాకులో ఉన్నాడని సరిపెట్టుకుని ఆ రాత్రికి నౌకరు సాయం అవసరం లేకుండానే వెళ్ళిపోయాడు.

తర్వాత సంవత్సరం గడిచిపోయింది. భారతిని భాస్కరం దగ్గరకు పంపటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఏ ఒక్కటీ ఫలించలేదు. డబ్బు, చదువు, హోదా, పరువు, ప్రతిష్ఠలు పుష్కలంగా ఉన్న భాస్కరాన్ని యే వైపునుంచీ దెబ్బతియ్యలేక, గత్యంతరం లేక వూరుకున్నారు వాళ్ళు; కాని ఆ కసి, ద్వేషం అంతా అప్పుడప్పుడు భారతిమీద ప్రయోగించబడుతూనే ఉన్నాయి. భారతికి తను చేసిన తప్పేమిటో యెంత ఆలోచించినా అర్థంగాలేదు. చివరికి చదువులేక పోవటం, నా అనే దిక్కులేకపోవటం, యీ రెండే తన దోషాలు అనుకుంది. ఆ పరిస్థితుల్లో హఠాత్తుగా విశాలని కలుసుకోవటం, విశాల ఫర్వాలేదని ధైర్యం చెప్పటం భారతికి మళ్ళీ కాస్త ఆశ చిగురింప చేసినాయి.

తనే పరిస్థితుల్లో వెంటపెట్టుకుని వచ్చిందీ చెప్పిన విశాల ముగిస్తూ "రాక రాక వచ్చి నీ మనసుకి కష్టం కలిగిస్తే నిజంగా క్షమించమని కోరుతున్నాను. పొద్దుపోయింది పడుకో" అంది.

"అదిగాదు-!" ఏదో చెప్పబోయాడు భాస్కరం.

"ఇప్పటికి మాట్లాడింది చాలు. రేపు మాట్లాడుకోవచ్చు." విశాల లేచి క్రిందకు వెళ్ళిపోయింది.

నిట్టూర్పు విడిచిన భాస్కరం విశాల మాటలు చెవుల్లో గింగురు

మంటూండగా కళ్ళెదుట మగతగా ఆవరించుకుంటున్న నిద్ర కెరటాల మధ్య వుండి వుండి భారతి మొహం కదులు తూండగా చాలా సేపు అలాగే కూర్చుండిపోయాడు.

# 3

పదిరోజులు ఇట్టే గడిచిపోయినాయి. విశాల వెళ్ళిపోయేరోజు వచ్చింది. రాత్రి రైలులో వెళ్ళిపోవటానికి బట్టలు సర్దుకుంటున్న విశాల దగ్గరికి భాస్కరం వచ్చి నిలబడ్డాడు. చీరెల మడతలు పొందికగా పెట్టెలో పెడుతున్న విశాల ఆగి వెనక్కు తిరిగి "ఏమిటి" అన్నట్టు చూసింది. భాస్కరం జేబులోంచి డబ్బు తీసి యిచ్చాడు.

"ఎందుకు? ఖర్చులకి నాదగ్గరుంది."

"భారతికోసం! ఇకనుంచీ నెలనెలా జీతంలోంచి కొంత పంపే ఏర్పాటు చూస్తాను."

ఈ పదిరోజుల్లో భారతిసంగతి మళ్ళీ ఇద్దరూ యెత్తలేదు.

భాస్కరం మౌనం చూసి లోపల్లోపల సంతోషించింది విశాల. ప్రయత్నం ఫలించింది అనుకుంది. కాని యిదేమిటి మళ్ళా?

"అయితే నాకివ్వటం దేనికి?" అర్థంగానట్టు అడిగింది డబ్బు వైపు, భాస్కరంవైపు చూస్తూ. భాస్కరంమొహంలోకి రక్తంపొంగింది. వచ్చిన కోపాన్ని తమాయించుకొని "ప్రస్తుతానికి నీతో తీసుకెళ్ళు తర్వాత చూద్దాం, నెలనెలా నీకు డబ్బు పంపుతాను" అన్నాడు.

విశాలకళ్ళుక్షణంసేపు చురుగ్గా చూశాయి.వెంటనే అడ్డంగా తలూపుతూ "నా కవన్నీ తెలియవు; వాళ్ళత్తయ్యకి నీకప్పగిస్తానని చెప్పాను గాని, నా దగ్గరకు తీసుకెళ్ళి ఉంచుకొంటానని చెప్పలేదు. నీకిష్టం లేక పోతే సరాసరి అక్కడికే పంపించెయ్యి. నిన్ను కాదనే సాహసం అక్క డెవరికీలేదు. అయినా నీకెంత సాహసం! డబ్బు తీసుకుని భారతిని నా దగ్గిర ఉంచుకోమంటున్నావా?" విశాల మొహం యెరుపురంగుకి తిరి గింది.

"అబ్బెబ్బే, అదికాదు .." తన కోపంమాట మర్చిపోయి భాస్కరం తడబడ్డాడు.

"ఏదయినా ఫర్వాలేదులే? అయినా నువ్వు మునుపటి భాస్కరానివి కాదని బాగా తెలుస్తోంది. నీ యిష్టం. ఏమైనా చేసుకో? నేనేం ఆ అమ్మాయికి యిక్కడ స్వర్గసుఖాలు చూపిస్తానని తీసుకురాలేదు. అయినా అసలు భారతిలో ఏం లోపం వుందని?" విశాల విసురుగా పెట్టె సర్దుకోవటం మొదలు పెట్టింది.

భాస్కరం గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

"భగవాన్! ఈ దేశంలో ఆడపిల్లయి పుట్టేకంటే...." లోలోపల అనుకుంటున్న విశాల మళ్ళీ అడుగులచప్పుడు వినడంతో ప్రక్కకు తిరిగి చూసింది. ఈసారి వచ్చింది భాస్కరంకాదు - భారతి. బహుశా ఏ ప్రక్కనో నిలబడి అంతా వినివుండొచ్చు. విన్నట్టు భారతి మొహం చూస్తేనే స్పష్టంగా తెలుస్తోంది. "ఏమిటి?" అంది విశాల తలెత్తకుండానే. భారతి జవాబు చెప్పలేదు. ఈసారి తలెత్తి చూసిన విశాల "ఏమిటి!" అంది పరీక్షగా భారతినిచూస్తూ. నిజంగా భాస్కరానికి కళ్ళుపోయినాయి. ఇంత చక్కటి విగ్రహం వెయ్యి జన్మలెత్తినా అతనికి దొరకదు

"నేనుకూడా మీతో వచ్చేస్తాను!" సుళ్ళుతిరుగుతున్న కన్నీళ్ళమధ్య భయం భయంగా విశాలవైపు చూస్తూ, తెరచివున్న పెట్టె మూతమీద చేయివేస్తూ అంది. అక్కడ మేనమామ కొడుకులు తనని శని అని, మా పాలిట తద్దినం అని ఎన్నెన్నో అనేవారు. చాలా బాధే అన్పించేది. కాని ఆ బాధలో తన దురదృష్టం అని ఓ విధమైన ధైర్యంవుండేది. ఇప్పుడు భాస్కరం ఆ మాటలేమీ అనలేదు. కాని తను ఉండటం అతని కిష్టం లేదు అనే ఊహే తనని పిచ్చిదాన్ని చేస్తుంది. ఈ బాధతో బ్రతకటం అనవసరం అనీ, ఎందులోనయినా దూకి ప్రాణాలు తీసుకోమనీ చెబుతోంది. మొట్టమొదటిరోజు క్షణంసేపు తనవైపు ఎంత ఆప్యాయంగా చూశాడు! భార్య అని తెలియగానే ఒక్కసారెలా మారిపోయాడు! అతని కళ్ళల్లో ఆప్యాయత అనేది చూడకపోతే-అది వేరే విషయం. ఇప్పుడిది సహించలేదు.

తనముందు బొమ్మలా నిలబడిన భారతివైపు కాసేపు పరీక్షగా చూచిన విశాల, వెంటనే మళ్ళీ బట్టలు సర్దుకుంటూ నీ ఉద్దేశ్యం నాకర్థం అయింది. కానినువ్వు ఇక్కడ నుంచి రావటానికి వీలులేదు. మీఅత్తయ్య

దగ్గరనుంచి తీసుకొచ్చింది నేను. నేను చెప్పినట్టు నువ్వు చెయ్యాలి. కొన్నాళ్ళు దగ్గరగా వుంటే వాడు మారవచ్చు. మారకపోయినా మారే దాకా నువ్వు ఓపికపట్టాలి. మార్చుకోవటం నీ విధి. వాడు నీ వాడు. నీ యిష్టం. ఆలోచించుకో. ." అంది. భారతికేం జవాబు చెప్పాలో తోచలేదు.

అన్నంత పనీ చేసింది విశాల. భారతి లేకుండానే రైలెక్కింది. భాస్కరం మొహం మాడ్చుకోవటం తప్ప ఏం చేయ్యలేకపోయాడు. రైలు కదలబోతూండగా భాస్కరం చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ "రాక రాకవచ్చి ఈసారి నీ మనసుచాలా బాధపెట్టి వెడుతున్నాననుకుంటాను. ఒక్క విషయం నువ్వు ఆలోచించు. ఇందులో భారతి చేసిన తప్పేముంది? నీకిష్టంలేని పెళ్ళిచేసిన దోషం అమ్మది. ఆవిడ కెదురు చెప్పలేని నీ అసమర్థతకి భారతిని బలి చేయడం న్యాయంకాదు. ఆ అమ్మాయి నీ కే విషయంలోను అడ్డురాదు. నీనుంచి తను కోరేదల్లా ఇంత తిండి బట్ట, భర్తదగ్గర ఉన్నాను అనే రక్షణ-అంతే. అవి నీకు అసాధ్యం కావు. అంతకుమించి మితిమీరి ఏదయినా ప్రవర్తిస్తే నాకు ఉత్తరం రాయి, నేనొచ్చి తీసుకెడతాను. అంతేకాని, ఏ పరిస్థితుల్లోనూ తిప్పి వెనక్కి పంపకు. ఇప్పుడిలా వచ్చి నీచేత తిరస్కరింపబడి వెడితే మరీ చులకనైపోతుంది." వ్యక్తిత్వంతోపాటువాక్చాతుర్యంకూడా భగవంతుడి దగ్గరనుంచి వరంగా తెచ్చుకున్న విశాలలాటి వాళ్ళతో మాట్లాడటం ఎవరితరం?

రైలు కదిలిపోయింది. కిటికీలోంచి చెయ్యి ఊపుతున్న విశాల క్రమేపీ దూరమైపోయింది. భాస్కరం యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా బహుమతి అంటూ తెచ్చిన భారతిని వదిలేసి చక్కాపోయింది.

విశాలని పంపేసి స్టేషను నుంచి తిరిగివస్తున్న భాస్కరానికి ఆలోచనలతో మతిపోసాగింది. ఆ రోజు భారతి పెళ్ళితో సుమతి బంధం తెగిపోయింది. ఈరోజు మళ్ళీ భారతిరాకతో రేణు దూరమైపోతుందా! కాదు అలాకావటానికి వీలులేదు. రేణుని తను పెళ్ళి చేసుకుని తీరాడు. రేణు పరిచయం ప్రణయంగా మారుతోందని గ్రహించినప్పుడే చూచాయగా భారతి విషయం చెప్పేశాడు కాని ఆమెకి చెబుతున్నప్పుడు మళ్ళీ హఠాత్తుగా భారతి యిలా తన జీవితంలో తిరిగి ప్రవేశిస్తుందని కల్లోకూడా

అనుకోలేదు. ఏమైనాసరే ఈ విషయం వెంటనే రేణుకు చెప్పెయ్యాలి. భాస్కరం స్టేషన్‌నుంచి సరాసరి రేణు యింటికి వెళ్ళాడు.

భాస్కరం వెళ్ళేసరికి అప్పుడే ఏదో పనిమీద యెక్కడికో వెళ్ళి వచ్చి బట్టలు మార్చుకుంటోంది రేణు. ఎమ్.బి.బి.యస్. ఫైనల్‌లోకి వచ్చి, మరో సంవత్సరంలో డాక్టరు కాబోతున్న రేణు కాలేజీలో చదువులోకాని, ఆట పాటలలో కాని, ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తింపబడి, అందరి మన్ననలకి పాత్రురాలవుతూ, యెప్పుడుచూసినా క్షణం తీరుబడి లేనట్టు ఏదో ఒక పనిలో తిరుగుతూ వుంటుంది మెడికల్ కాలేజి తరపున వార్‌ఫండ్ కోసం విరాళాలు పోగుచెయ్యటం కోసం తిరుగుతున్నారు అంతా. ప్రస్తుతం అదే పనిమీద బయటకెళ్ళి తిరిగి తిరిగి అలిసిపోయి వచ్చింది.

భాస్కరం వచ్చాడని తెలియగానే బట్టలు మార్చుకుంటున్న రేణు గబగబా ఆ పని ముగించుకొని బయటి కొచ్చింది అప్పటికే ముందు గదిలో కూర్చున్న భాస్కరం కాఫీ తాగుతున్నాడు అంతవరకూ ఏదో మాట్లాడుతున్న రేణుతల్లి, కూతురురాగానే ఏదో పనిఉందంటూ లేచి వెళ్ళిపోయింది. ఆవిడ సాధ్యమైనంత వరకూ రేణు, భాస్కరాల్ని వంటరిగా వదిలెయ్యడానికే చూస్తుంది.

"మీ అక్కయ్య వచ్చారని చెప్పారు?"కాఫీ తాగుతూ అంది రేణు. "అవును. ఇవాళే వెళ్ళిపోయింది. నేను స్టేషన్‌నుంచే వస్తున్నాను." రేణుకి పరిచయం చేయలేకపోయినందుకు ఏదోచెప్పాలని భాస్కరం ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సమస్య రేణుతీర్చేస్తూ "సారీ! నేను కలవలేకపోయాను. వెధవగొడవలతో ఒక్కనిమిషం టైముండటంలేదు"అని క్షమాపణ చెప్పుకుంది. భాస్కరం తేలిగ్గా వూపిరి పీల్చాడు. ఓవిధంగా రేణు హడావుడిలో వుండటం మంచిదే అయింది. కాని భారతి విషయం చెప్పేసెయ్యాలి. ఎంత త్వరగా చెబితే అంతమంచిది. భాస్కరం కళ్ళెత్తి చూసేసరికి రేణు కుర్చీలో వెనక్కు జారగిలబడి పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూంది.

"రేణూ! నీతో ఒక విషయం చెప్పాలి."సాధ్యమయినంత మామూలుగా అన్నాడు

"చెప్పండి ఏమిటి?" ఈ లోకంలోకి వస్తూ అంది.

"ఇక్కడకాదు. ఎక్కడన్నా, ఒంటరిగా..." రేణుకళ్లు క్షణంసేపు మెరిసాయి వెంటనే చిలిపిగానవ్వుతూ"నాకు తెలుసు-మీరు చెప్పబోయేది" అంది.

"ఏమిటి అనుకుంటున్నావు?" గతుక్కుమంటూ అడిగాడు, "భారతి విషయం కొంపదీసి తెలియలేదుగదా!" అనుకుంటూ.

"ఎక్కడయినా ఒంటరిగా మనలాంటివారు చెప్పుకునే విషయాలేముంటాయి?" రేణుమొహం వెంటనే గంభీరంగా మారింది. వంగి టేబిల్ క్లాత్‌ని సరిచేస్తూ "కాని నాచదువు పూర్తయ్యేవరకూ పెళ్ళి ప్రసక్తివద్దు. ఈలోపల ఒకర్ని ఒకరం కొంచెం బాగా అర్థం చేసుకోవచ్చు" అంది.

భాస్కరం తెల్లబోయాడు.

"ఇంకేమైనా చెప్పండి. వింటాను. ఇవాళ నేను చాలా అలసిపోయాను. ఏమేం చేశానో చెప్పనా...వింటారా?"సహజంగా ఇద్దరి మధ్యా జరిగే సంభాషణల్లో యెప్పుడూ రేణు చెప్పేవే ఎక్కువ కబుర్లుంటాయి. అదే యివాళా జరిగింది. వాళ్ళ కాలేజీ తరపున అంతా కలిసి కాశ్మీర్ వెళ్ళాలనుకుంటున్నారట! వీలయితే భాస్కరాన్ని కూడా సెలవుపెట్టి రమ్మంది.

చాలా పొద్దుపోయింతర్వాత రేణూ వాళ్ళింట్లోనే భోంచేసి ఇంటికి వచ్చాడు. వస్తూనే సరాసరి తన గదిలోకి వెళ్ళిపోయి బట్టలు మార్చుకొని పడుకున్నాడు. ఎక్కువసేపు యే ఆలోచనలతోనూ అలసి పోకుండానే అతనికి నిద్రపట్టేసింది.

## 4

నెలరోజులు పైగా గడిచిపోయినాయి. క్షేమంగా చేరినట్టు విశాల వద్దనుంచి ఉత్తరం కూడా చాలా రోజులయింది. నెలరోజులు గడిచినా రేణుతో భారతి విషయం చెప్పే అవకాశమే దొరకలేదు. అక్కడికీ రెండు మూడుసార్లు యింటికి ఆహ్వానించాడు- చూస్తేనన్నా ఆ ప్రసక్తి వస్తుందేమోనన్న ఆశతో. రేణు, భాస్కరం పిలిచినప్పుడు రాలేదు. ఒకసారి హఠాత్తుగా వచ్చింది. వచ్చింది ఒంటరిగా రాలేదు. వెంట వది

మంది ఉన్నారు. అలాంటప్పుడు భారతి ప్రసక్తి తీసుకు రావటం అసంగతమేగాక, అసభ్యం కూడాను.

భాస్కరం దినచర్యకూడా ఈ మధ్య పూర్తిగా మారిపోయింది. ఉదయం తొమ్మిదికి టిఫినూ, కాఫీ తీసుకుని వెళ్ళిపోతే, మధ్యాహ్నం ఒంటిగంటకి నాయరే ఆఫీసుకి భోజనం తీసుకెళ్ళియిస్తాడు.

సాయంత్రం అటునుంచి అటే రేణు దగ్గరకు, లేకపోతే క్లబ్‌కి వెళ్ళిపోతాడు. రాత్రి యింటికి వచ్చేసరికి పదకొండుకు తక్కువకాదు.

ఉదయం వెళ్ళిపోయి రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగివచ్చే భాస్కరానికి భారతి అనే వ్యక్తి యింట్లో వున్నట్టే అనిపించలేదు. ఉన్నకాస్త వ్యవధిలో భారతి కావలి అనుకుంటే భాస్కరం దృష్టిలో పడవచ్చు కాని, అలాటి ప్రయత్నం యేమీ చెయ్యకపోగా మరింత జాగ్రత్త పడుతోంది అనటానికి నిదర్శనం, ఈ నెలరోజులలో ఒక్కసారికూడా ముఖాముఖి ఇద్దరూ యెదురుపడకపోవటమే. భాస్కరం ఎప్పుడన్నా ఆఫీసునుంచి యెక్కడికయినా వెళ్ళాలని బట్టలు మార్చుకోవటం కోసంగాని, దేనికోసం కాని అనుకోకుండా సమయంకాని సమయంలో హఠాత్తుగా యింటికొస్తే గబుక్కున తన దృష్టినుంచి మాయమయేది. చీరకొంగో లేక కొంగు చివరలో కన్పించేవి. అప్పుడు క్షణంసేపు భారతి గుర్తు వచ్చినా, వెంటనే నవ్వుతున్న రేణు మొహం దాన్ని బలంగా తోసేసి నిలబడేది. అందుకే అప్పుడప్పుడు భారతి మొహం గుర్తు వచ్చినా భాస్కరానికి అసక్తి ఉండేదికాదు.

ఆ రోజు లేస్తూనే ఒళ్ళంతా నొప్పులుగా, బడకంగా అనిపించింది. కాని లక్ష్యపెట్టకుండా ఆఫీసుకి వెళ్ళాడు. ఆ సాయంత్రం రేణు స్నేహితులతో కలిసి కాశ్మీర్ వెడుతోంది. భాస్కరం సెలవుకోసం ప్రయత్నం చేశాడు కాని దొరకలేదు. అయినా వాళ్ళంతా కాలేజీవాళ్ళు. ఒక విషయంలో సామ్యం ఉన్నవారు వాళ్ళందరి మధ్య వేలుపెట్టి చూపించినట్టు తనెందుకు?

"నువ్వు వెళ్ళగానే ఉత్తరం రాయి. నీకు జవాబు రాస్తూనే వో విషయం రాస్తాను." రేణు ప్రయాణానికి సిద్ధం అవుతుండగా అన్నాడు అతను.

"ఓకే! ఏమిటో అది చెప్పగూడదూ? అదేమిటి? మొహం అలా ఉందేం? ఒంట్లో బాగా లేదా?" అంది గబుక్కున లేచివచ్చి నుదురు తాకి చూస్తూ.

"ఏదో వొళ్ళంతా నొప్పులుగా ఉంది. నువ్వు త్వరగా వచ్చెయ్యి రేణూ!" అన్నాడు భాస్కరం, ఆమె చేతిని తన చేతులోకి తీసుకుంటూ. క్షణంసేపు భాస్కరంవైపు పరీక్షగా చూసిన ఆమె మెల్లగా చేతిని విడిపించుకుని వెళ్ళి మిక్చర్ లాటిదేదో కలిపి తెచ్చి భాస్కరం చేత తాగించింది.

రేణుని రైలెక్కించి తిరిగి వస్తున్న భాస్కరానికి వొళ్ళంతా మరింత బద్ధకంగా, బరువుగా అనిపించసాగింది. రేణు యిచ్చిన మందు నొప్పులు తగ్గించటానికి బదులు ఎక్కువచేసి, కడుపులో కొత్త బాధని ఒకటి సృష్టించి వికార పెట్టసాగింది.

ఇంటికి వచ్చిన భాస్కరం ఎంతో ప్రయత్నంమీద కారుగేరేజ్‌లో పెట్టగలిగాడు ఏదో బాధ ఫలానా అని తెలియదు. నరాలు కొరికేస్తోంది. కణతలు పగిలిపోతున్నాయి. కళ్ళముందు చీకటి వలయాలుగా తిరుగుతోంది. తూలుతూ వచ్చిన భాస్కరం గుమ్మందగ్గర ఆగిపోయి వాంతి చేసుకున్నాడు. కళ్ళు బయర్లు కమ్మిపోయి లోపలికి వెళ్ళటంగూడా చేతనయ్యేటట్లు లేదనిపించి "నాయర్!" అని కేకవేశాడు. కడుపులో బాధ తగ్గలేదు. ఎవరో బలంగా మెలితిప్పినట్టు అన్పిస్తోంది. ఇంతలో ఏదో పనిమీద అటువచ్చిన భారతి భాస్కరాన్ని చూస్తూనే గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళబోయింది. "నాయర్! నన్ను లోపలికి తీసుకెళ్ళు" భాస్కరం వెనుకనుంచి బాధగా పిలవటంతో ముందుకు పోబోతున్నదల్లా ఆగి వెనక్కు తిరిగి చూసింది భారతి. చూస్తుండగానే మరో వాంతి చేసుకున్నాడు. వాంతి చేసుకుంటూనే మోకాళ్ళమీద క్రిందకూలబడి పోయాడు. క్షణంసేపు అర్థంకానట్టు చూసిన భారతి వెంటనే పరుగెత్తుకొచ్చి భాస్కరాన్ని పట్టుకుంది.

"నన్ను పైకి తీసుకువెళ్ళు. డాక్టరుకి కబురుచెయ్యి." తన దగ్గరగా వచ్చిందెవరో గుర్తించలేని భాస్కరం. మీద పడిన చేతులను ఆధారం చేసుకొని లేస్తున్నాడు. అతని కళ్ళు బయర్లు కమ్మి పూర్తిగా కన్పించటం

మానేశాయి. తల తిరిగిపోతోంది. సన్నగా సున్నితంగా ఉన్న చేతిని ఆధారం చేసుకుని తనలో ఉన్న బలమంతా ఉపయోగిస్తూ వెళ్ళి మంచ మీద అడ్డంగాపడి కాళ్ళు అందిస్తూ "బూటు, మేజోళ్ళు విప్పెయ్. టై కూడా" అన్నాడు నీరసంగా. క్షణంసేపు పెద్ద పెద్ద కళ్ళుచేసి చూసిన భారతి వెంటనే ఆ పనులు చెయ్యటానికి పూనుకుంది. టై విప్పటానికి మెడ దగ్గరగా వచ్చిన చేతుల్ని హఠాత్తుగా గట్టిగా పట్టుకున్న భాస్కరం పిచ్చివాడిలా "త్వరగా డాక్టర్ని పిలిపించు, నా ప్రాణం పోతోంది" అని మటుకు అనగలిగాడు. అంతే తెలుసు అతనికి. మగత లాటిదేదో అతని ప్రతి నరాన్నీ ఆవరించేసుకుని స్పృహ తప్పేలా చేసేసింది.

భాస్కరానికి తిరిగి మెలకువ వచ్చేసరికి గదిలో కిటికీలోంచి వస్తున్న సూర్యకాంతి వెచ్చగా ప్రక్కమీద, కుర్చీమీద పడుతోంది. కంటికి కన్పిస్తున్నంతమేర అంతా పరిశుభ్రంగా తళతళ లాడుతోంది.

అబ్బ! ఎంత దీర్ఘమైన రాత్రి! ఈ రాత్రిని తను జన్మలో మరచి పోలేడు ఒక్క రాత్రిలో ఎంత నీరసం? చెయ్యి కదపటానికి కూడా ఓపిక లేనట్టుంది. మనసంతా తేలికగా ఉన్నా, మొహం బరువుగా వుంది. దుప్పటిలోపల ఉన్న చెయ్యితీసితడుముకుంటూనే ఉలిక్కిపడి భాస్కరం తల తిప్పి టేబిల్ మీదున్న స్టాండు కాలెండరువైపు చూశాడు. అందులో ఎవరో తేదీలు మార్చారు. పద్దెనిమిదవ తారీఖు చూపిస్తోంది. రేణు వూరికెళ్ళింది. పదకొండో తారీఖు....ఆ రాత్రేగా అతనికి జ్వరం వచ్చింది? వారం రోజులు వొంటిమీద స్పృహ లేకుండా పడి ఉన్నా డన్నమాట తను!

"ఎలావుంది వొంట్లో?" గుమ్మానికున్న కర్టెన్ తొలగించుకుని లోపలికి వస్తున్న డాక్టరు నవ్వుతూ అన్నాడు.

భాస్కరం నీరసంగా నవ్వాడు. దగ్గరగా వచ్చి పరీక్షచేసి యింజ క్షన్ యిచ్చి డాక్టరు- "మీరు చాలా అదృష్టవంతులు! ఊళ్ళో విష జ్వరాలు ముమ్మరంగా ఉన్నాయి. ఇంకో గంట నాకు కబురు రావటం ఆలస్యం అయితే...." డాక్టరు వాక్యం పూర్తి చెయ్యటానికి బదులు నవ్వే శాడు. "అయినా అంతా ఆమె అదృష్టం అని చెప్పచ్చు-నా మందుల కంటె...."

"బాగా ఆకలిగా వుంది. ఈరోజు భోజనం చెయ్యాలా?" డాక్టరు మాటల్ని ఖండిస్తూ అడిగాడు భాస్కరం తనకి స్పృహలేనప్పుడు భారతి సేవచేసి వుండవచ్చు అనుకుంటూ.

"ఓకే! మీకు తినాలనిపిస్తే తప్పకుండా చారూ, అన్నం తినండి" డాక్టరుగారి కళ్ళు యెవరికోసమో గుమ్మంవైపు వెతకసాగినాయి.

ఆరోజే చారూ, అన్నం తిన్నాడు భాస్కరం. భోజనం అయిం తర్వాత నాయరు పోస్టు తెచ్చి యిచ్చాడు. అందులో రేణు కాశ్మీరు నుంచి వ్రాసిన ఉత్తరం ఉంది. అది వచ్చి కూడా మూడు రోజులయింది.

ఆ రాత్రి భాస్కరానికి మళ్ళీ జ్వరం వచ్చింది. డాక్టరు వచ్చి ఇంజక్షన్ యిచ్చి ఫర్వాలేదనీ, రేపటికి పూర్తిగా తగ్గిపోతుందనీ ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు. డాక్టరు ఇంజక్షన్ ఇవ్వగానే నిద్ర పట్టేసింది.

ఓ రాత్రివేళ వంటినిండా చెమటపట్టి మెలకువ రావటంతో కన్నులు తెరిచిన భాస్కరానికి తన గుండెమీద ఏదో బరువుగా ఉన్నట్టు అనిపించింది. నీరసంగా ఉన్న అతని కళ్ళకి మొట్టమొదట అదేమిటో తెలియలేదు గదిలో స్పష్టంగా వెలుగుతున్న బెడ్‌లైటు కాంతిలో పరీక్షగా చూసిం తరువాత అది విసనకర్ర పట్టుకున్న ఎర్రటి గాజులున్న తెల్లటి చెయ్యి అని తెలిసింది. అది తెలిసిన పూర్తి స్పృహ కలిగేసరికి, తన మంచానికి దగ్గరగావున్న చిన్న స్టూలుమీద కూర్చున్న భారతి ముందుకు వాలిపోయి మంచ పట్టెమీద తల ఆనించి నిద్రపోతోంది. విసనకర్ర పట్టుకున్న చెయ్యి తన గుండెలమీద అడ్డంగా పడివుంది. దగ్గరగా తన గుండెలకి పక్కగా మంచి నిద్రలో ఉన్న భారతిని భాస్కరం పరీక్షగా చూశాడు. నిద్రమత్తుకి రెప్పలు బరువుగా మూసుకుపోయినాయి. మొహం అలసటగావున్నా ప్రశాంతంగా ఉన్నట్లు అందంగా ఉన్న కనుబొమ్మలు తెలుపుతున్నాయి. చెదిరిపోయిన జుట్టులోంచి విడివడిన ఒకటి రెండు పొడుగాటి వెంట్రుకలు నుదుటిమీదనుంచి అడ్డంగా బుగ్గలమీదకు జారి, నిద్రపోతూన్నది భారతా, లేక స్వప్నదేవతా అన్పించేలా చేస్తున్నాయి. మరుక్షణంలోనే రేణు గుర్తుకువచ్చిన భాస్కరం చటుక్కున తనమీద పడిన భారతి చేతిని తొలగించి పక్కనపెట్టాడు. ఆ కాస్త కదలికకే ఉలిక్కిపడి లేచింది భారతి.

"దాహం అవుతోంది." భారతివైపు పరీక్షగా చూస్తూ అడిగాడు... క్షణంసేపు నిద్రరాక మెలకువకాని స్థితిలో కంగారుగా అయోమయంగా చూసిన భారతి స్పృహ తెచ్చుకుని వెంటనే లేచివెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"ఫాన్ వుందిగా. వెయ్యకపోయావా?" మొట్టమొదటి సారిగా మాట్లాడుతూ అన్నాడు.

"చప్పుడికి మెలకువ వస్తుందేమోనని...డాక్టర్ ఎక్కువ సేపు నిద్ర పోవటం మంచిదని చెప్పాడు." భారతిగొంతు భయంభయంగా యెక్కడ నుంచో మాట్లాడుతున్నట్లుగా వుంది.

"ఫర్వాలేదు, వెయ్యి, నాకిప్పుడేం అక్కరలేదు. నువ్వెళ్ళిపడుకో."

భాస్కరం చెప్పినపని చేసి నిశ్శబ్దంగా గదిలోంచి వెళ్ళిపోయింది. భాస్కరానికి తర్వాత చాలా సేపు నిద్రపట్టలేదు. భారతి కావాలని తన స్పర్శకోసం అలా చేసిందో, లేక నిద్రమత్తులో తూగిఅలా నిద్రపోయిందో ఏదీ అర్థంకాలేదు.

అతని అంతరాత్మమటుకు రెండోదే నిజమని చెప్పసాగింది.

డాక్టరు చెప్పినట్టు మర్నాటికే జ్వరం తగ్గిపోయింది. రెండు మూడు రోజుల్లోనే భాస్కరం మామూలు మనిషి కాగలిగాడు. కొద్ది నీరసం తప్పితే అతనిలో యింకేం కన్పించటంలేదు. డాక్టరుకి బిల్లు యిచ్చేస్తూ, "థాంక్యూ డాక్టర్!" అన్నాడు. తనకి వంటిమీద స్పృహలేనప్పుడు రెండు పూటలావచ్చి శ్రద్ధగా చూసివెళ్ళాడని నాయర్ చెప్పాడు. ఇతను ప్రక్క వీధిలోకి వచ్చిన కొత్త డాక్టరు. ఇంతకుముందు అతనితో భాస్కరానికి ముఖ పరిచయంకూడా లేదు. అతనికికూడా దాదాపు తన ఈడే వుంది. కాకపోతే కాస్త పొట్టి.

"నో, నో! అది మా పని. కాని యిందులో శ్రమపడ్డ వ్యక్తి నిజంగా..." డాక్టరు ఆసక్తిగా లోపలి గుమ్మంవైపు చూస్తూ అన్నాడు. భాస్కరానికి ఆ రాత్రి తర్వాత మళ్ళీ భారతి కన్పించలేదు. అతనికి మెలకువ వచ్చి తన పనులు తను చేసుకునే ఓపిక వచ్చినప్పటినుంచీ మళ్ళీ అన్నీ నాయరే చూస్తున్నాడు.

డాక్టర్‌కి ఫీజు యిచ్చేస్తున్న భాస్కరానికి అతనంత నిస్సంకోచంగా లోపలిగదివైపు చూపులు పరపటం యెందుకో యిష్టం అన్పించలేదు. ఈ పది రోజుల్లో భారతి తనకి రాత్రింబవళ్ళు మేలుకుని సేవచేసి ఉండవచ్చు. అది వేరే సంగతి.

వారం పదిరోజులు గడిచిపోయినాయి. అనుకున్న ప్రకారం తిరిగి రావటంలేదనీ, ప్రయాణం మరోపదిరోజులు పొడిగించబడిందనీ, అమ్మని జాగ్రత్తగా చూస్తుండమనీ కోరుతూ రేణు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆరోజు ఉదయమే రేణుకి వెంటనే జవాబురాస్తూ భారతి విషయంకూడా వివరంగా రాసి, చివర—"భారతి సమస్య పూర్తిగా నీ యిష్టానికి వదిలేస్తున్నాను రేణూ! నీతీర్పుమీద ఆ అమ్మాయి జీవితం ఆధారపడివుంది. నాకు స్వయంగా భారతిమీద యే ఆసక్తిలేదు.

"ఆరోజు అమ్మ బలవంతంగా నాచేత తాళి కట్టించింది. ఈరోజు అక్క బహుమతి అంటూతెచ్చి అంటగట్టి వెళ్ళింది. ఇందులో నా ప్రసక్తి ఏమీ లేదు" అని రాశాడు. ఉత్తరం పూర్తిగా రాసినా యింకా ఏదో రాయాలనిపించి పోస్టు చెయ్యకుండా ఇంట్లోనే ఉంచేశాడు.

ఆరోజు అలవాటు చొప్పున ఆఫీసునుంచి క్లబ్‌కి వెళ్ళాడు. కాని క్లబ్‌లో మనుష్యులెవ్వరూలేరు. తనలా రెగ్యులర్‌గావచ్చే యిద్దరికి, తనకు తగిలినలాటిదే విషజ్వరం తగిలిందట. మరోయిద్దరు వూళ్ళోలేరు. క్లబ్‌లో విసిగేసిన భాస్కరం రోజూకంటె గంటముందు వచ్చేశాడు. అతనికి దోవ పొడుగునా భారతినియెలా వదిలించుకోవాలా అన్నదే ఆలోచన. తను రేపు పోస్టు చెయ్యబోయే ఉత్తరాన్ని రేణు యెలా స్వీకరిస్తుందో అనేదే సమస్య. ఇంటికి వచ్చేసరికి వాకిట్లో వరండాకి దిగువగా డాక్టరు సైకిల్ కన్పించింది. సైకిల్‌ని చూస్తూనే భాస్కరం కనుబొమలు ముడిపడ్డాయి. ఈ సమయంలో డాక్టర్ యింటికి యెందుకొచ్చినట్టు?

ఇంట్లో యెవరికీ నుస్తీగా లేదే! భాస్కరం ఊహల్లో అసహ్యమైన భావం ఒకటి మెలితిరిగింది. హాల్లోకి వస్తూనే "నాయర్!" అని పిల్చాడు. పిల్చిన వెంటనే పరుగెత్తుకొచ్చాడు నాయరు.

భాస్కరం వాడివైపు పరీక్షగా చూశాడు. అతని కళ్ళలో ఏ భావమూ దొరకటం లేదు.

"ఏంచేస్తున్నావు?"

"ఏంచెయ్యటంలేదు." అతని మొహం 'మీకేంకావాలి?' అన్నట్టుంది, కాని డాక్టరు వచ్చినట్టు చెప్పడేం?

"మంచినీళ్ళు యివ్వు."

నాయరు లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చేశాడు.

భాస్కరం ఏమీ ఎరగనట్టు పైకి వెళ్ళిపోయాడు.

మెట్లు ఎక్కుతున్నప్పుడు వెనకనుంచి యేక్షణం అయినా నాయరు ఏదయినా చెప్పవచ్చు అనుకున్నాడు. కాని నాయరేం చెప్పలేదు.

కొద్దిదూరం వచ్చిన భాస్కరం వెనక్కు తిరిగి చూసేసరికి అక్కడసలు అతను లేనేలేడు.

పైకి తన గదిలోకి వచ్చేసి కిటికీ దగ్గర నిలబడ్డాడు. ఇక్కడ ఈ కిటికీలోంచి చూస్తే గేటులోంచి ఎవరు వచ్చేదీ, యెవరు వెళ్ళేదీ స్పష్టంగా తెలుస్తుంది. బయటంతా ప్రశాంతంగా వుంది. దూరంగా ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. భాస్కరం చూపులు క్రింద గేటుమీదనే నిల్చివున్నాయి. దాదాపు పదిహేను నిమిషాలు పోయింతర్వాత ఇద్దరు వ్యక్తులు గేటు తీసుకుని బయటకు వెడుతున్నారు. భాస్కరం చప్పున కిటికీకి మరింత దగ్గరగా వచ్చి చువ్వల్ని పట్టుకుని చూశాడు. సందేహంలేదు, డాక్టరే! నాయరు సాగనంపుతున్నాడు. మధ్య మధ్య పైకి భాస్కరం గదివైపు చూపిస్తూ ఏదో చెబుతున్నాడు. హఠాత్తుగా తను ఇవాళ క్లబ్‌నుంచి త్వరగా ఇంటికి వచ్చేసినట్టు గుర్తొచ్చింది. తనవెనక యెన్నాళ్ళనుంచీ ఈ నాటకం సాగుతుందో? భాస్కరం కళ్ళముందు ఆరోజు తను ఫీజు యిస్తున్నప్పుడు డాక్టరు చూపులు గుర్తువచ్చాయి. భారతి వయసులో వుంది. ఆ వయసు తనచేతగుర్తింపబడే అవకాశంలేదని తెలుసుకుందేమో? ఇదేమిటి? తనకు కోపంవస్తోందెందుకు? భారతిమీద తనకెలాటి ఆసక్తీ లేనప్పుడు అధికారం మటుకు ఎలా వుంటుంది? లేదు, లేదు....క్రిందికి వెళ్ళి భారతిని అసలు విషయం అడిగి; ఇష్టమైతే వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసెయ్యొచ్చు.

భోజనం కోసం క్రిందకు వచ్చినప్పుడు భోజనంచేస్తూ "ఇవ్వాళ డాక్టర్‌గారు వచ్చివెళ్ళారా?" అని అడిగాడు జాగ్రత్తగా నాయర్ మొహం

పరిశీలిస్తూ. భాస్కరం ఊహించినట్టు అతను తల్లక్రిందులవలేదు. కనీసం కంగారుకూడా పడలేదు. "ఊ" అని మటుకు అని కూర వడ్డించ సాగాడు. భాస్కరానికి మతిపోయింది. అతని ధైర్యం ఏమిటో అర్థం కాలేదు.

"ఎందుకట?" అడగలేకుండా వుండలేకపోయాడు.

"అమ్మగారి ఒంట్లో అసలు బాగాలేదు. మీకు వచ్చిన జ్వరం లాటిదే వచ్చింది."

తినటం ఆపిన భాస్కరం హఠాత్తుగా తలెత్తుతూ "నాకెందుకు చెప్పలేదు?" అన్నాడు. వడ్డిస్తున్న నాయర్ పెదవి కొరుక్కొని తల వంచేసుకోవటం తప్ప జవాబివ్వలేదు.

భోజనం అయిపోయిం తర్వాత భాస్కరం లేచి భారతి గది వయిపు వెళ్ళాడు. ఇన్నాళ్ళనుంచీ ఆమె యింట్లో ఏమూల ఉంటూందో; ఏంచేస్తూ తన కాలాన్ని గడుపుతోందో అతనికి తెలియదు. లోపల గదిలో మామూలు పట్టెమంచంమీద పాత జంపఖానా వేసుకుని పడు కుని వుంది. తలక్రింద తనువేసుకునే దిండు వుంది. అది ఉదయం వరకూ తన మంచంమీదనే వుంది. ఈ సాయంత్రమో ఎప్పుడో బహుశా నాయర్ తెచ్చి ఉండవచ్చు. భాస్కరం మంచందగ్గరగా వెళ్ళాడు. గంట క్రితం డాక్టర్ ఇచ్చివెళ్ళిన ఇంజక్షన్ ప్రభావంవల్ల కాబోలు; ఆమె బాగా మగతనిద్రలో ఉంది. ఇంటికిరాగానే డాక్టర్ సైకిల్ కన్పించగానే తన మనసులో మెదిలిన అసహ్యమైన భావానికి భాస్కరం సిగ్గుపడ్డాడు. ఇలాంటి అమాయకపు పిల్లకి అది ఊహామాత్రంగా కూడా రాదని అత నికి స్పష్టంగా తెలుస్తోంది.

ఇంతలోనాయర్ వెకనునుంచి నీళ్ళగ్లాసుతో వచ్చాడు. రెప్పవాల్చ కుండా భారతి మొహంలోకి చూస్తున్న భాస్కరం అడుగుల చప్పుడు విని వెనక్కుతిరిగి "ఏమిటి?" అన్నాడు."వేడినీరు. గంటకొకటి చొప్పున తెల్లవారేదాకా మాత్రలు వెయ్యాలి." టేబిల్ మీదున్న పొట్లంలోంచి మాత్రలుతీసి అన్నాడు నాయర్.భారతి మంచినిద్రలోవుంది. బలవంతాన లేపి కూర్చోపెట్టి వెయ్యాలి. నాయర్ భాస్కరంవైపు చూసుండి పోయాడు. ఆ చూపులలో అర్థం గ్రహించిన భాస్కరం నాయర్ చేతిలో

మాత్ర తీసుకెళ్ళి మంచంమీద కూర్చుని భారతిని లేపాడు. ఒకసారి అటు ఇటూ కదిలి కన్నులు తెరిచింది భారతి. కాని ఆ చూపులో నిశ్చలత్వం లేదు. మళ్ళీ మెల్లిగా మూసుకుపోయినాయి.

"లేపి కూర్చోపెట్టి యెలాగో యిది వేసే మంచిది." నాయర్ మెల్లగా అన్నాడు. క్షణంసేపు భారతివైపు చూసిన భాస్కరం వెంటనే ఎడంచెయ్యి మెడక్రిందవేసి లేపి కూర్చోపెట్టాడు. నాయర్ ముందు కొచ్చి నీరు యిచ్చాడు. కుడిచేత్తో మాత్రని పట్టుకుని భారతి నోట్లో ఉంచాడు. కొద్దిగా స్పృహ రావటంతో కన్నులుతెరిచి "ఏమిటి?" అంది.

భాస్కరం జవాబివ్వ లేదు. భారతి నోట్లో మాత్ర వేసేసి మంచి నీరు పట్టేశాడు. మంచినీరు త్రాగుతూనే మళ్ళీవెనక్కు వాలిపోయింది. ఆ కొద్దిసేపటికే మెడచూట్టూ వేసిన తన చెయ్యి కాలిపోవటంతో జ్వరం తీవ్రంగా ఉందనుకున్నాడు భాస్కరం.

"గంట గంటకీ మందు వెయ్యాల్సివుంటే యిక్కడెలా? నేను మాటిమాటికి క్రిందకు రాలేను. పైకి తీసుకెళ్ళి పడుకోపెడితే సరి పోతుంది." నాయరువైపు చూస్తూ అన్నాడు. తలూపిన నాయరు పైకి వెళ్ళి ప్రక్క సరిచేసి వచ్చాడు

కొద్దిరోజులక్రితం ఏ జ్వరంతో ఏ పక్కమీద భాస్కరం పంటి మీద తెలివి లేకుండా పడుకున్నాడో అదే పక్కమీద అదే జ్వరంతో ఇప్పుడు అదే స్థితిలో భారతి పడుకునివుంది. మంచానికి కొద్దిదూరంలో ఉన్న పడక కుర్చీలో వెనక్కువాలి పడుకున్నాడు భాస్కరం. భారతి నిద్రలోనే ఉండి ఏడుస్తోంది.

"వద్దు వద్దు—డాక్టర్ని పిలవవద్దు, నన్నుచచ్చిపోనివ్వు. నాకెవరూ లేరు" అంటోంది. కాసేపు "ఎక్కడికైనా పారిపోతాను. వద్దు ...వద్దు" అంటోంది. ఏ వాక్యమూ పూర్తి కావటంలేదు. మధ్యమధ్య విపరీతంగా వచ్చిన ఏడుపు ఆ మాటల్ని మింగెయ్యసాగింది.

ఆ రాత్రి, మర్నాడుకూడా భారతికి అలాగేఉంది. డాక్టర్వచ్చి వెంటనే మందుపడితే చాలా బాగా వుండేదని, తనని పిలవటమే చాలా ఆలస్యం అయిందనీ చెప్పాడు. ఆ రోజు గడిస్తే, జ్వరం తగ్గవచ్చు అని

చెప్పి వెళ్ళిపోయాడు. ఆఫీసునుంచి త్వరగా వచ్చేసి భారతి దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ఇవాళల్లా అతని మనసంతా చికాకుగా వుంది. తనకి సరైన వేళలో డాక్టర్ మందు పడింది కాబట్టి తిప్పుకున్నాడు కాని భారతి? భారతికేదయినా జరిగితే ఇక తనజీవితంలో శాంతి అంటూ ఉంటుందా? తన ఆత్మ తనని క్షమించదు. ఆ అమ్మాయి తనకు యిష్టంలేకపోవచ్చు. తన భార్యగా తనూహించిన అర్హతలు లేకపోవచ్చు కాని. . కాని ఆ రోజు తను సూత్రంకట్టి నలుగురిలో నా దానివి అంటూ చేసుకున్నాడు. రేణుకి రాసిన ఉత్తరం డ్రాయర్లో అలాగే ఉండిపోయింది. ఎందుకో అది పోస్టు చెయ్యాలనిపించలేదు. ఒకవేళ భారతి కేదైనా జరిగితే ఇహ ఆ ఉత్తరం పోస్టే చెయ్యబడదు. నయం అయితే, అప్పుడు... అప్పుడు చూడాలి. జ్వరంలో అదోవిధమైన మత్తులో వాడిపోయి ప్రక్కకు వాలిపోయిఉన్న భారతి మొహం భాస్కరాన్ని వెర్రివాడిని చేస్తోంది. దగ్గరకెళ్ళి ఆ మొహాన్ని చేతులలోకి తీసుకుని నీమీద నాకేమీ ద్వేషంలేదు. భారతీ! నువ్వు బ్రతకాలి అని నేను మనసారా కోరుకుంటున్నాను అని చెప్పాలనిపించింది.

నిద్రలోనే ఏడుస్తున్న భారతి హఠాతుగా మంచంమీద లేచి కూర్చుంది. భాస్కరం చప్పున లేచి దగ్గరకు వెళ్ళాడు. జ్వరంతో యెర్రబడిపోయిన కళ్ళతో భాస్కరాన్ని డాక్టరనుకుని "డాక్టర్! నే నీబాధ భరించలేను. త్వరగా చచ్చిపోయేందుకు మందివ్వండి" అంది. మరుక్షణంలోనే నవ్వుతూ "నాకుతెలుసు, నేను చచ్చిపోతున్నానని. అందుకే నాకింత హాయిగా ఉంది. కొంతమంది బ్రతికి ఉండేకంటే చచ్చిపోయి సుఖపడతారు!-" అంతలోనే మళ్ళీ మోకాళ్ళలో తలదూర్చి ఏడుస్తూ "చచ్చిపోయినా ఫర్వాలేదు డాక్టర్! నా కెవ్వరూ లేరు. నాకోసం ఎవ్వరూ ఏడవరు. ఎవ్వరూ ఏడవనే ఏడవరు. ఎవరికీ అక్కర్లేదు నేను" అంటూ తనే వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. మంచానికి దగ్గరగా వచ్చిన భాస్కరం భారతి భుజం మీద చేయి వేశాడు అతని కర్థమైంది, భారతి మనసులో ఇంత బాధ వుందని అతనెప్పుడూ వూహించనే లేదు.

ఆ రాత్రల్లా అలా ఏడుపుతోనే గడిచిపోయింది. మర్నాడు ఉదయం టెంపరేచర్ తగ్గలేదు. కాని మాటలలో ఉధృతం లేదు. డాక్టర్

సలహామీద భాస్కరం సెలవుపెట్టి యింట్లోనే ఉండిపోయాడు. రాత్రి పదిగంటలకి జ్వరం కొద్దిగా జారి చెమటలు పోశాయి. చిన్న తువాలు తీసుకుని భాస్కరం మంచంమీద కూర్చుని భారతి మొహం, చేతులు తుడవ సాగాడు. మందు సిరంజిలోకి తీసుకుంటున్న డాక్టర్ "ఎంత గమత్! కొద్దిరోజుల క్రితం మీకామె యెలా చేశారో, ఇప్పుడు మీరు సరిగ్గా అలా చేస్తున్నారు. ఈ ఇంజక్షన్‌తో బాగా నిద్ర పట్టేస్తుంది. నేను మళ్లా రేపు ఉదయం వచ్చి చూస్తాను. పన్నెండుగంటలకి ఓసారి మళ్ళా ఆ మందు వెయ్యండి" అని యింజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాడు. డాక్టర్ చెప్పినట్టే నిద్రపోయింది భారతి. మంచం ప్రక్కనే అలాగే కుర్చీలో పడుకుని నిద్ర పోయాడు భాస్కరం.

మర్నాడు భారతికి స్పృహవచ్చేసరికి ఉదయంతొమ్మిది అయింది. "మందు వేసుకుంటావా?" అన్నాడు. భారతి చూపులు నీరసంగా ఉన్నా, మామూలుగా ఉన్నాయి.

దేంతోనో పెద్దగా పోట్లాడి అలసిపోయిన మనిషిలా వుంది.

దగ్గరగావస్తున్న భాస్కరాన్ని చూస్తూనే కంగారుగా లేవబోయింది

"వద్దు, వద్దు. పడిపోతావు, లేవకు. నేను లేపుతాను." భాస్కరం మంచంమీద కూర్చుని ఓ చెయ్యి మెడచుట్టూ వేసి ఆసరా యిచ్చాడు.

అయోమయంగా క్షణంసేపుకంగారుగాచూసిన భారతి తలతిప్పుతూ "వద్దు,వద్దు. నాకు మందువద్దు. నన్ను వదిలెయ్యండి" అని ఏడవసాగింది. అనుకోకుండా యధాలాపంగా పట్టుకున్న భాస్కరం చేతిలో మందుగ్లాసు భారతి తోసెయ్యడంతో క్రిందపడి పగిలిపోయింది. మందు వలికిపోయింది. తెల్లబోయిన భాస్కరానికి ఏమనటానికి తోచలేదు. భారతి వెంటనే వెనక్కి వాలిపోయి గోడవైపు తిరిగి దిండులో మొహం దాచుకుంటూ "నన్ను వదిలెయ్యండి. ఇక్కడ మంచి క్రిందికి పంపెయ్యండి" అని వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. మరోసారి కలిపి తీసుకువచ్చిన మందుకూడా భారతిచేత తాగించలేకపోయాడు. అతను ఎన్ని విధాల ప్రయత్నం చేసినా భారతి మొహాన్ని దిండులోంచి యివతలకు తీయలేకపోయాడు.

సాయంత్రం ఆఫీసునుంచి రావటంతోనే నాయర్‌నిపిలిచి భారతి మందు విషయం అడిగాడు. "వేసుకోలేదు" అని జవాబిచ్చాడు నాయర్. ఎంతో సున్నితంగా కన్పించే భారతిలో ఈ మొండితనం చూసి అతను నిజంగానే ఆశ్చర్యపోయాడు. భోజనం చేసి పడుకోబోయే ముందు భాస్కరం మళ్ళీ తను మందు తీసుకుని వచ్చాడు.

అతన్ని చూస్తూనే దిండులో మొహం దాచుకుని ప్రక్కకు తిరిగి మంచానికి అంటుకుపోయింది.

"ఇదిగో, గొడవ చెయ్యకు. నువ్వు మందు తాగటం మానినంత మాత్రాన చచ్చిపోవు. ఊ! తాగు." కంఠంలో కావాలని యెంత కటుత్వం తెచ్చి పెట్టుకుందామన్నా అతనికి చేతకావటంలేదు. అతనికి తెలియకుండానే మాటలు మృదువుగా వస్తున్నాయి.

దిండులో మొహం దాచుకున్న భారతి ఉలకలేదు, పలకలేదు. భాస్కరం భుజంపట్టి లేవదీయబోయాడు. బలంగా విడిలించుకుంది.

"ఎందుకలా చేస్తావు?"

భారతి జవాబివ్వలేదు.

"నీకంత నిజంగా చచ్చిపోవాలని వుంటే నా అభ్యంతరం ఏమీ లేదు; కాని ఈ ఇంట్లో ఆ పని జరగటానికి వీలులేదు. త్వరగా మందు తీసుకుని కోలుకో!"

భారతి ఏమనుకుందో ఏమో, లేచి ఒక గుక్కలో మందు తాగేసి తిరిగి మళ్ళీ గోడవైపు మొహం పెట్టుకుని పడుకుంది.

భారతికి వచ్చిన ఈ జ్వరంతో దగ్గరగా మసలిన ఈ కొద్దిరోజుల్లో భాస్కరానికి మనసులోంచి ఏవో సన్నటితెరలు జారిపోయి, భారతి-తను ముఖాముఖి నిలబడ్డట్టయింది. ఇలా నిలబడ్డ భారతిని తను వదలలేడు. ఆరోజున ఫలానాఅనితెలియకుండా స్టేషన్‌లో దృష్టిని ఆకర్షించిన భారతి ఈరోజు తన మనసుని ఆకర్షించింది. ఈ కొద్దిరోజుల్లో భాస్కరానికి స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే-రేణుకి తను లేకపోయినా ఫర్వా లేదు కాని, భారతికిఅలాకాదు. తనుకాదంటే జీవితమేలేదు. అందుకే చచ్చిపోవాలి అనే కోర్కెని అలా బలంగా పెంచుకుంది. విశాలఅన్నట్టు అమ్మకి జవాబు చెప్పలేని తన అసమర్థత-భారతి జీవితాన్ని బలి చెయ్యకూడదు.

భారతిని హృదయపూర్వకంగా స్వీకరించటం తన ధర్మం అనిపించింది. రేణుకి రాసిన ఉత్తరం పోస్టుచెయ్యనేలేదు. అది చించేసి తను జబ్బుపడి లేచినట్టు, ప్రస్తుతం కులాసాగానే ఉన్నట్టు జవాబు రాశాడు.

మర్నాటికి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. భాస్కరం దగ్గరుండి బలవంతంగా భారతిచేత చారూ, అన్నం తినిపించాడు. మంచం ప్రక్కగా ఉన్న పడకకుర్చీలో దిళ్ళుసరిచేసి, పక్కపై పడుకోవటం ఇష్టంలేకపోతే అందులో వచ్చిపడుకోమని,తోచకపోతే పుస్తకాలుచూసుకోమనీ ప్రక్కనపెట్టి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అతనికి ఇదివరకులా భారతితో మాట్లాడాలంటే సంకోచం అన్పించటంలేదు. పైగా అలా మాట్లాడటం ఎన్నిరోజులనుంచో అలవాటైనట్టుగా మామూలుగా వుంది. కాని భారతి దీనికిబొత్తిగాఅలవాటు పడలేదు. అతను ఉన్నంత సేపు భయంభయంగా బెరుకుగానేవుంటోంది

ఆ రోజు వెడుతూ నాయర్‌ని పిలిచి తను క్లబ్‌నుంచి ఇవాళ కొంచెం ఆలస్యంగా వస్తానని, భారతికి మందువిషయం గుర్తు చెయ్యమని చెప్పి వెళ్ళాడు. ఆఫీసులోకి వెళ్ళగానే అతను చేసిన మొట్టమొదటి పని రేణుకి భారతి విషయం వివరంగా రాసి, భారతిని తను తిరస్కరించలేనని, పరిస్థితి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించమని, వంచకుడని, హృదయాలతో ఆడుకునే మూర్ఖుడనీ అనుకోవద్దనీ తను యెప్పటికీ రేణు స్నేహితుడేననీ ఉత్తరంరాసి పోస్టుకి పంపించాడు.

ఆ సాయంత్రం క్లబ్‌లో ప్రెసిడెంటుకి జ్వరంగావుండి రాలేకపోవటం వల్ల జరగవలసినమీటింగు రద్దుఅయింది. ఉదయం ఆలస్యంగావస్తానన్న భాస్కరం రెండు గంటలు ముందుగానే వచ్చేశాడు. వస్తూనే సరాసరి పైగదిలోకి వచ్చేసిన భాస్కరానికి మంచంమీద భారతి కన్పించలేదు. ఏముంది కాస్తటపికవచ్చింది కాబోలు, లేచి క్రిందకు వెళ్ళిపోయింది-అని మనసు జవాబిచ్చింది. అద్దంముందు నిలబడి టైవిప్పుకుంటున్న భాస్కరానికి డ్రెస్సింగ్ టేబిల్‌మీద దువ్వెనకింద కాగితం యేదో కన్పించేసరికి ఉలిక్కపడి గబగబ తీసి చూశాడు. ఉత్తరం-భారతి రాసింది!

"మీకు,

నా నమస్కారాలు. మీనుంచి దూరంగా వెళ్ళిపోతున్నాను అనే భావం నన్నిలా ధైర్యంగా ఉత్తరం రాయడానికి పురికొల్పింది. మీకే

మాత్రం యిష్టం లేకుండా నన్ను పెళ్ళి చేసుకున్నారని తెలిసింది. అది తెలిసికూడా మీ విశాలక్కయ్య నన్ను తీసికొచ్చి బలవంతంగా మీదగ్గర వదిలి వెళ్ళింది. మొన్న మీకు జ్వరంవచ్చేవరకూ ఆ జ్వరంలో మీ కలవరింతలు వినేవరకూ రేణు అనే అమ్మాయి మీ జీవితంలోకి వచ్చిందని గాని, ఆమెకు మీరు ఆప్తులనిగాని నాకు తెలియదు. తెలిసినప్పటినుంచి నా కర్తవ్యం యేమిటా అని ఆలోచించనిక్షణంలేదు. కాని నా నిశ్చయాన్ని వెంటనే అమలుజరపకుండా ఈ జ్వరం ఒకటివచ్చి పడింది. నాకు బుద్ధి తెలియకముందే నాన్న పోయారు. పెళ్ళి సంవత్సరం వుందనగా అమ్మ పోయింది. అమ్మ పోవటంతో నాకీలోకం శూన్యమే అన్పించింది. నా అనే వారు లేని దిక్కులేనిదాన్ని నేను. అత్తయ్య విసుక్కున్నా, నేను వాళ్ళ పాలిట శనిలా దాపురించానని బావలు నా మొహంమీదే తిట్టినా, నాకు బాధ నిపించింది గాని, ఏనాడూ చచ్చిపోవాలనిపించలేదు. మీదగ్గర కొచ్చిన తర్వాత, మీకు నేను అవసరంలేదని స్పష్టపడిన తర్వాత నాకు మృత్యువు తప్ప వెళ్ళదగ్గచోటు లేదనిపించింది.

మీయింట్లో చచ్చిపోవటం మీకిష్టంలేదని మీరు స్పష్టంగాచెప్పారు. మీ ఉద్దేశ్యం నాకర్థమైంది. అందుకే యింట్లోంచి వెళ్ళిపోతున్నాను. నేనేమై పోయాను అని నా తరఫున మిమ్మల్ని అడిగేవాళ్ళు యెవరూ లేరు. నాకెవ్వరిమీదా కోపంలేదు. కేవలం దురదృష్టవంతురాల్ని అనే బాధమటుకు నా నరాల్ని పీకేస్తోంది.

నన్ను క్షమించండి,
జ్వరంలో మీరు నన్ను చాలా దయగా చూశారు;
అందుకు కృతజ్ఞురాల్ని,
భారతి."

లైటు విప్పుకోవటం సగంలో ఆపేసి అలాగేఉత్తరంపట్టుకునిక్రిందకు పరుగెత్తుకొచ్చిన భాస్కరం-"నాయర్, నాయర్!" అనిబిగ్గరగా పిలిచాడు. అతని అరుపుకి యిల్లంతా ప్రతిధ్వనించింది. వంట ఇంటిలో ఏదో పని చేస్తున్న నాయర్ చేతో గరిటతో అలాగే యివతలకు వచ్చేశాడు.

"భారతేది?" పిచ్చివాడిలా అడిగేడు.

"పైనే వున్నారు."

"ఎప్పుడు?- ఎంతక్రితం చూశావు?"

"ఇంతకుముందే. పావుగంట కూడా కాలేదు. మందు వేసుకోమని చెప్పివచ్చానే?" కంగారుగా అన్నాడు నాయరు.

"పావుగంటక్రితమేనా? భాస్కరం చేతిలోని ఉత్తరంపైపు ఒక సారి చూసి బయటకు పరుగెత్తాడు.

వీధికి ఆచివర, ఈచివర చాలాదూరం వరకూ నాయర్, భాస్కరం యిద్దరూ చూసివచ్చారు. కాని భారతి కనిపించలేదు. "ఏమైపోయింది? ఎక్కడి కెళ్ళింది?"

భాస్కరంకళ్ళలో నీళ్ళుతిరిగాయి. భారతిని పోగొట్టుకునేముందా తను గుర్తించిది?-భారతి విలువ తెలుసుకుంది? నాయర్ని మరికొంచెం ముందుకువెళ్ళి చూసిరమ్మని భాస్కరంఒంటరిగాయింటికితిరిగివచ్చేశాడు.

అతనికి ఇంట్లోకి వెళ్ళాలనిపించటంలేదు. ఎంత పొరపాటుచేశాడు తను! జ్వరంలో తన కలవరింతలు అన్నీ విందిగాబోలు. భగవాన్! నుదురుపట్టుకుని, ఇంట్లోకి వెళ్ళటం ఇష్టంలేని భాస్కరం యింటిముందు కుడివైపుగా వున్న పూలమొక్కలలోకి వెళ్ళి అక్కడ రాతి బెంచీమీద కూర్చున్నాడు. ఎందుకిలా అయింది?

భారతిని గుర్తించలేని యీ గుడ్డితనం తనని మాయలా యిన్నాళ్ళెందుకు ఆవరించింది? అది పోయేసరికి భారతికూడా మాయమైంది. అతని గుండెల్లో దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించసాగింది. తన ఈ తప్పుకి శిక్షేమిటి ?

పరధ్యానంగా, బాధగా, అన్నీ పోగొట్టుకున్నవాడిలా కూర్చున్న భాస్కరానికి యెక్కడినుంచో సన్నగా ఏడుపు వినిపించింది. హఠాత్తుగా అతనిచెవులు పరీక్షగా విన్నాయి. కళ్ళు చురుగ్గా పనిచేశాయి. మరుక్షణమే లేచి నిలబడి చీకట్లో చెట్లమధ్య వెతుకుతూ "భారతీ! భారతీ!" అని పిలవ సాగాడు. ఆపిలుపులోఆర్ద్రత రాళ్ళనికూడా కరిగించేలా వుంది. భాస్కరానికి జవాబురాలేదు కాని ఏడుపువిన్పిస్తోంది. చీకట్లోమల్లెపందిరి ప్రక్కగా క్రిందకూలబడిన భారతి మోకాళ్ళమధ్య తలదాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది ఇంట్లోంచి వెళ్ళిపోవాలని బయటకు వచ్చేసింది. కాని గుమ్మం దాటుతూనే కళ్ళు బైర్లు కమ్మినాయి గేటువయిపు అనుకుని, మొక్కల

వయిపు వచ్చింది. తన కాళ్లు బలహీనంగా వణుకుతున్నాయి. అడుగులు ముందుకు వెయ్యలేక నిలబడలేక మల్లెపందిరిని ఆసరా చేసుకుని క్రింద కూలబడి పోయింది. అక్కడనుంచి వెళ్ళిపోవాలి. తను వెళ్ళిపోవాలి. "భగవాన్! కొద్దిగా కాస్త ఓపిక యివ్వు. నేనీ ఈ ఇంట్లో ఒక్క క్షణంకూడా వుండను. నన్నీరాత్రి యెవరూ గుర్తుపట్టకుండా చెయ్యి." ఏడుస్తూనే భగవంతుడిని ప్రార్థించసాగింది.

"భారతీ!" భాస్కరం చేతులు ఆత్రంగా, ఆప్యాయంగా, బలంగా, హఠాత్తుగా భారతిని చుట్టేశాయి. ఉలిక్కిపడి తలెత్తిచూసింది. చీకట్లో మొహం స్పష్టంగా కనపడకపోయినా ఆ తెల్లటిబట్టలు, ఆ పొడుగాటి విగ్రహం భాస్కరానివే అని చెబుతున్నాయి.

"అబ్బ! నిజంగా ఇంక కన్పించవనే అనుకున్నాను. ఇదేమిటి, ఇక్కడెందుకు కూర్చున్నావు?" భాస్కరం హఠాత్తుగా రెండు చేతులతో భారతిని పైకెత్తేశాడు.

"వద్దు, వద్దు నన్ను ముట్టుకోవద్దు, నన్ను వెళ్ళిపోనివ్వండి."

వెక్కిళ్ళ మధ్య భారతి బలంగా గింజుకుంటూ అంది.

కాని భాస్కరం వదలలేదు. అలాగే కదలనివ్వకుండా నొక్కిపట్టి ఇంటిలోకి తీసుకొచ్చి పైగదిలో మన మంచంమీద పడుకోబెట్టాడు.

"వెళ్ళిపోనివ్వండి, నన్ను వెళ్ళిపోనివ్వండి"- భారతి పిచ్చిదానిలా లేచి కూర్చుంది. భారతిని పడుకోపెట్టి తనూ మంచం మీదనే కూలబడిన భాస్కరం భారతిని వొడిలోకి లాక్కుంటూ "ఇంకెక్కడికిపోతావు నువ్వు? నువ్వు ఊహించినదంతా అబద్ధం, నాజీవితంలో ఇప్పుడు భారతి తప్ప యే అమ్మాయిలేదు" అని భారతితలెత్తి గుండెలకు నొక్కుకుంటూ "బహుమతి అంటూ విశాల వదిలేసిన వ్యక్తి విలువ నేను బాగా గుర్తించాను. కాకపోతే కాస్త ఆలస్యమైంది. నన్ను క్షమించు భారతీ! భగవంతుడు క్షమించాడు కాబట్టే; పూర్తిగా పోయావు అనుకున్న నిన్ను మళ్ళీ నాకిచ్చాడు. చెప్పు, నీ కిప్పుడు బ్రతకాలనిలేదూ?" నుదురు మీద కళ్ళమీద, జుట్టుమీద మాటిమాటికీ ముద్దుపెట్టుకుంటూ అన్నాడు. కలో నిజమో అర్థంగాని భారతిఅతనిచేతుల్లో పసిపిల్లలా మారిపోయింది. భారతిని అలా పట్టుకుని భాస్కరం రేణుకి ఉత్తరం రాసిన సంగతి,

తను యింటికి వచ్చి ఉత్తరం చూడగానే పొందిన అనుభవం గురించీ చెప్పసాగాడు. "నా యింట్లో చచ్చిపోవటానికి వీల్లే"దని అనటంలో తన ఉద్దేశాన్ని భారతి యెలా పొరపాటుగా అర్థం చేసుకున్నదీ కూడా వివరించాడు. అంతా చెప్పిన తర్వాత భారతి తలని గుండెలకి మరోసారి నొక్కుకుంటూ తలమీద తన చెంపలు ఆన్చుకొని "ఇప్పుడు నిజంగా చెప్పు, నీకు చచ్చిపోవాలనే అన్పిస్తోందా?" అని అడిగాడు. భాస్కరం గుండెలలో తలదాచుకున్న భారతి "లేదు, లేదు! నిజంగా బ్రతకాలని పిస్తూంది. ఒకరోజు కాదు, వంద సంవత్సరాలు-వెయ్యేళ్లు!" అంది కళ్ళు గట్టిగా మూసుకుంటూ.

—o o—